

సమ్మక్కను దర్శించుకుంటున్న భక్తులు

## మేడారంలో భక్తుల సందడి

తాడ్వాయి, డిసెంబర్15: వనదేవతలు మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు గురువారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. జంపన్న వాగులో స్నానాలు ఆచరించిన అనంతరం కల్యాణకట్ట వద్ద తల్లులకు తలనీలాలను సమర్పించారు. అనంతరం అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలపై పసుపు, కుంకుమ, ఎత్తు బెల్లం నూతన వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించారు. పిల్లాపాపలు సల్లంగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

## మై భారత్ పోర్టల్‌ను వినియోగించుకోవాలి

ములుగురూరల్, డిసెంబర్ 15 : కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మై భారత్ పోర్టల్‌ను యువత వినియోగించుకోవాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆజాదిక అమృత్ మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ పోర్టల్‌ను యువత ఉపయోగించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను పొందాలన్నారు. https://mybharat.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని సూచించారు.

## మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలి

ములుగురూరల్, డిసెంబర్ 15 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏటూరునాగారం ఐటీడీఏ డీడీ పోచం అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పర్యవేక్షిస్తూ మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించి 10వ తరగతి పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించేలా కృషి చేయాలన్నారు. విధులపై అలసత్వం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేస్తూ నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని తెలిపారు.

## బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి

ములుగురూరల్, డిసెంబర్ 15 : ములుగు జిల్లా కేంద్రం నుంచి హనుమకొండ జిల్లా పరకాల వరకు.. రోజుకు 4 ట్రిప్పుల నూతన బస్సు సర్వీసులు ప్రారంభించినట్లు, ప్రజలు బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ములుగు ఆర్టీసీ కంట్రోలర్ బైకాని మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అబ్బాపూర్ వయా వసంతపూర్ మీదుగా వెళ్లే ఈ బస్సు ములుగు నుంచి ప్రతి రోజూ ఉదయం 8.30, 11.30, మధ్యాహ్నం 2.40, సాయంత్రం 5.40కి ప్రయాణికులతో బయలుదేరి వెళ్తుందని వివరించారు. బస్సు సర్వీసును ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## బాధిత కుటుంబానికి సాయం..

మంగపేట, డిసెంబర్ 15 : మండలంలోని కత్తిగూడెం గ్రామానికి చెందిన బేరుగు లచ్చినర్సయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, శుక్రవారం బాధిత కుటుంబాన్ని శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగ రమేశ్ పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. గ్రామస్తులు ద్వారా విషయం తెలుసుకున్న ట్రస్ట్ చైర్మన్ బాధిత కుటుంబానికి రూ. 2500, 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రామకృష్ణ, సంతోష్, రవితేజ, సుధీర్, సాయికుమార్, ప్రేమ్‌కుమార్, సత్యం, ట్రస్ట్ సభ్యులు రమేశ్, మహేశ్ పాల్గొన్నారు.

## ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



బహుమతులు అందజేస్తున్న సిబ్బంది

మంగపేట, డిసెంబర్ 5 : మండలంలోని రాజుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రావుల భాస్కర్‌రావు ఆధ్వర్యంలో దివ్యాంగ ఉపాధ్యాయులు, విద్యార్థులను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ దివ్యాంగులను తక్కువ చూపు చూడొద్దని సమాజంలో అందరితో సమానంగా చూడాలన్నారు. దివ్యాంగులైన వారు ఉన్నతమైన చదువులు చదివి మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారని, కొందరు పెద్ద శాస్త్రవేత్తలు కూడా అయ్యారని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన వసతులను అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో రాణించి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. పాఠశాలలోని దివ్యాంగ ఉపాధ్యాయులైన గడ్డం శ్రీనివాస్, పఠాన్ ఆస్మాబేగం, లక్ష్మయ్య, దివ్యాంగ విద్యార్థులను సన్మానించి, వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు వీరనారాయణ, పావని, జమున, రాజ్యలక్ష్మి, లావణ్య, పద్మ, ప్రమీల పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

**డీఈవో రామ్‌కుమార్**



మహదేవపూర్: విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రామ్‌కుమార్

మహదేవపూర్, డిసెంబర్ 15 : పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని జిల్లా విద్యాధికారి రామ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. పాఠశాలలోని వసతులు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, బోధన విధానంపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి పరీక్షల్లో రాణించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించేలా కృషి చేస్తూ ప్రణాళిక బద్ధంగా సాగాలని ఇన్‌చార్జి హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను ఆదేశించారు. విధులపై నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎంలు ఆకుల అశోక్, సరిత, ఉపాధ్యాయులు మడక మధుకర్, ప్రవీణ్ కుమార్, సక్కారాం, దేవేందర్‌రెడ్డి, తిరుపతి, ప్రభాకర్ రెడ్డి, ఎంఆర్‌సీ కార్యాలయ సిబ్బంది రాజు, శ్రీను, మహేశ్ పాల్గొన్నారు.

### టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 15 : చిత్రలేఖనం, టైలరింగ్‌కు సంబంధించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులకు ఈ నెల 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ రాంకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడో తరగతి ఉత్తీర్ణులైన వారందరూ ఈ పరీక్ష రాసేందుకు అర్హులని, ఫిబ్రవరి నెలలో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. దరఖాస్తు ప్రక్రియ, పూర్తి వివరాలకు కోసం.. డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ తెలంగాణ వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలో అర్హులైన వారందరూ వినియోగించుకోవాలని తెలిపారు.

# కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

**పీఏసీఎస్ చైర్మన్ ఎల్లారెడ్డి**

గోవిందరావుపేట, డిసెంబర్ 15 : మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రాథమిక వ్యవసాయ కేంద్రాల ద్వారా 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని తేమ, చెత్త లేకుండా నాణ్యతతో తీసుకువచ్చి తమ నిర్వాహకులకు సహకరించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, సాధారణ రకం ధాన్యానికి రూ.2183 ధర చెల్లించిస్తారని, ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**మండలంలో 22 కొనుగోలు కేంద్రాలు..**

మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి జితేందర్‌రెడ్డి తెలిపారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 12, ఐకేపీ 7, జీసీసీ ద్వారా 3 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతుల వద్ద ధా న్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు ఏవో తెలిపారు.

# గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వెంకటాపూర్, డిసెంబర్ 15 : గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్, జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలో గీత కార్మిక సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన రవిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మండల కమిటీ అధ్యక్షుడిగా గునిగంటి శోభన్‌గౌడ్, కార్యదర్శిగా కారుపోతుల సత్యంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా పచ్చిమట్ల రమేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా కోటగిరి సురేందర్‌గౌడ్, తడుక రవీందర్‌గౌడ్, సహాయ కార్యదర్శిగా తడుక బిక్సాగౌడ్, బుర్ర సర్వేశం గౌడ్, కోశాధికారిగా పులి రమేశ్ గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా దొమ్మటి రాజసమ్మయ్యగౌడ్, సలహాదారులుగా మునిగాల రాజమౌళిగౌడ్, కమిటీ సభ్యులుగా పూజారి విజయ్‌గౌడ్, బుర్ర సాంబయ్యగౌడ్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

# నియంతృత్వ విధానాలను కేంద్రం మానుకోవాలి

**తపాలా ఉద్యోగుల సంఘం**
**డివిజన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు**



దీక్షా శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులు

ములుగురూరల్, డిసెంబర్ 15 : తపాలా ఉద్యోగులపై అనుసరిస్తున్న నియంతృత్వ విధానాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని ఆలిండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం హనుమకొండ డివిజన్ కార్యదర్శి బొద్దుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. న్యాయపరమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ తపాలా ఉద్యోగులు ములుగులోని కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె శనివారం 4వ రోజుకు చేరుకుంది. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పనిచేస్తున్న తపాలా ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొని ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కాగా, ఈ సమ్మెలో వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. గ్రామీణ తపాలా ఉద్యోగులకు నియమించిన కమలేశ్ చంద్ర కమిటీలోని అనుకూల సిఫార్సులను అమలు చేయడంలో కేంద్రం విఫలమైందన్నారు. ఈ సమ్మెలో ఆనందం, హుస్సేన్, తిరుపతి, వెంకటేశ్, రసూల్‌బీ, రమేశ్ కుమార్, సుజాత, ఇంద్రిరా, అజీజ్, రంజిత్‌కాంత్, కిషన్‌ప్రసాద్, షఫి, శ్రీలతాదేవి, పున్నం, కుమారస్వామి, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# 17న జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ములుగురూరల్, డిసెంబర్15 : ములుగు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రాజిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాకారంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అదే రోజున జిల్లా స్థాయి క్రాస్ కంట్రి ఎంపిక పోటీలను సైతం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ప్రధాన కార్యదర్శి పీ వెంకటేశ్వర్‌రెడ్డి 9440240037ను సంప్రదించాలన్నారు.



మాట్లాడుతున్న డీఎం రవిచందర్

# బస్టాండ్‌లో బస్సులు తిప్పేందుకు ఆర్టీసీ అధికారులు యత్నం

**అడ్డగించిన భూ యజమానులు..**

కాటారం, డిసెంబర్ 15 : మండలకేంద్రం శివారులోని పీహెచ్‌సీ సమీపంలో 353(సీ) జాతీయ రహదారి పక్కన రెండున్నర దశాబ్దాల క్రితం కూల్చివేసిన ఆర్టీసీ కాటారం-2 బస్టాండ్ స్థలంలో మళ్లీ కాటారం-కాళేశ్వరం రూట్లో వచ్చిపోయే బస్సులను తిప్పేందుకు అధి కారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. కాగా, భూపాలపల్లి ఇన్‌చార్జి డీఎం రవిచందర్, విజిలెన్స్ సెక్యూరిటీ అధికారుల ఆధ్వర్యంలో పలువురు ఆర్టీసీ సిబ్బంది బస్సును తీసుకొని బస్టాండ్ స్థలానికి వెళ్లారు. ఆర్టీసీ బస్టాండ్ కోసం భూదానం చేసిన వారి బంధువులు, బొప్పారం గ్రామస్తులు బస్సులను తిరగనీయమంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఆర్టీసీ బస్టాండ్ కోసం స్థలాన్ని దానం ఇస్తే దానిని వినియోగించలేదన్నారు. గతంలో బస్సులను నడపలేదని, అందుకే భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎలాంటి పునరుద్ధరణ పనులు చేపట్టవద్దని ఘర్షణకు దిగారు. దీంతో కాళేశ్వరం ఎస్సై లక్ష్మణ్‌రావు, మహదేవపూర్ ఎస్సై రాజ్‌కుమార్, కొయ్యూర్ ఎస్సై నరేశ్, కాటారం ఎస్సై-2 సురేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. ఇటీవల హైకోర్టు ఆర్టీసీ సంస్థకు బస్సులను నడుపుకోవడానికి అనుమతి ఇచ్చిందని, ఎలాంటి అడ్డంకులు కల్పించవద్దని ప్రతివాదులకు ఆదేశాలు జారీ చేసిందని డీఎం రవిచందర్ ఎస్సైలకు వివరించారు. వచ్చే నెల 10న కోర్టులో హియరింగ్ ఉందని అక్కడే తేల్చుకుని ఆదేశాలు తెచ్చుకుంటే మంచిదని పోలీసులు సూచించినా పలువురు వాగ్వాదం చేశారు. సీఐ రంజిత్‌రావు ఫోన్‌లో బస్సులను అడ్డగించేవారితో మాట్లాడినా వినకపోవడంతో పలువురిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆర్టీసీ అధికారులు పలు బస్సులను బస్టాండ్ స్థలంలోకి పంపించారు. ఇరు వర్గాల వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పలు డిపోల ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.